ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 31 అక్టోబరు 2025



మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఎయిర్‌పోర్టులో హాట్ ఫైర్ మాక్ ఎక్సర్‌సైజ్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు క్రాష్‌గేట్-2 వద్ద ఏఆర్ఎఫ్ఎఫ్ ఆధ్వర్యంలో నెలవారీ హాట్ ఫైర్ మాక్ ఎక్సర్‌సైజ్‌ను గురువారం నిర్వహించారు. ఆపరేషన్ కమాండర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో 30 మంది సిబ్బంది, తొమ్మిది మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది, అపోలో ఏఎంసీ సిబ్బంది ముగ్గురు పాల్గొన్నారు. మాక్ ఎక్సర్‌సైజ్ డీబ్రీఫింగ్ సమయంలో ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు సంభవించలేదు.



ప్రీపెయిడ్ టాక్సీ కౌంటర్ ప్రారంభోత్సవంలో అధికారులు

ట్రాఫిక్ పోలీస్ ప్రీపెయిడ్ ట్యాక్సీ కౌంటర్ ప్రారంభం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు ప్రీపెయిడ్ ట్యాక్సీ కౌంటర్‌ను గురువారం ప్రారంభించారు. సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ సాయిమనోహర్ ఆధ్వర్యంలో కౌంటర్‌ను ఏతఃఆర్‌వో ప్లాజా సమీపంలోని సీ లెవెల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వానలు జిల్లాలోని పంటలను ఆగమాగం చేశాయి. పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లింది. అనేకచోట్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు పత్తికే అధికంగా నష్టం జరిగింది. అయితే అధికారులు పంట నష్టంపై ప్రాథమిక అంచనాల కోసం రూపొందించిన నిబంధనలు రైతులకు శాపంగా మారాయి. పంటలకు 33 శాతానికిపైగా నష్టం జరిగితేనే నష్టం జరిగినట్లుగా అధికారులు గుర్తిస్తున్నారు. అలాగే నీటమునిగిన పంటతో పాటు నేలకొరిగిన పంటకు మాత్రమే నష్టం జరిగినట్లు పరిగణనలోకి తీసుకుంటుండటం గమనార్హం.

రైతు గోస పట్టదా?

పంట నష్టం ప్రాథమిక అంచనాలపై విమర్శలు

జిల్లాలో కేవలం 12 ఎకరాల్లోనే పత్తి పంటకు నష్టం అంచనా

- మొత్తం 478 ఎకరాల్లో పంటల నష్టం అంచనా
- 33 శాతానికి పైబడితేనే నష్టం జరిగినట్లు గుర్తింపు
- పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు



యాచారం : మొండిగౌరెల్లిలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారి

ప్రాథమిక పంట నష్టం అంచనా	
ప్రభావిత గ్రామాలు	48
పంట నష్టం	478
నష్టపోయిన రైతులు	315
వరి (ఎకరాలు)	466
పత్తి (ఎకరాలు)	12

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : మొంథా తుపాన్ వల్ల కురిసిన వర్షాలతో పత్తికే అధికంగా నష్టం జరిగింది. అయితే అధికారులు పంట నష్టంపై ప్రాథమిక అంచనాల కోసం రూపొందించిన నిబంధనలు రైతులకు మరింత ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా పత్తి రైతుల పాలిట ఈ నిబంధనలు శాపంగా మారాయి. దీనికి తోడు పంటలకు 33 శాతానికిపైగా నష్టం జరిగితేనే నష్టం జరిగినట్లుగా అధికారులు గుర్తించడంతో రైతాంగానికి మరింత ఇబ్బందుల్లోకి నెట్టుతోంది. పంటలన్నీ చేతికి అందివచ్చిన సమయంలో మొంథా తుపాన్ విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీని ప్రభావంతో గడిచిన నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలు రైతుల ఆశలను అడియాసలు చేశాయి. కోత దశలో ఉన్న పంటలకు ఎక్కువగా నష్టం జరిగింది. ప్రధాన పంటలైన పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అనేకచోట్ల పంటలు నీటమునిగాయి. వరి పంటలు నేలకొరిగాయి. జిల్లాలో

మిగతా 8వ పేజీలో...



మాడ్గుల : అందుగులలో పత్తి పంటను పరిశీలించి మహిళా రైతుతో మాట్లాడుతున్న ఏవో అరుణకుమారి

రైతులు అధైర్య పడొద్దు

షాద్‌నగర్ రూరల్ : వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్య పడొద్దని జిల్లా వ్యవసాయ అధికారి ఉషా తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారులో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 33 శాతం కంటే ఎక్కువగా నష్టం జరిగితే వ్యవసాయ అధికారుల ద్వారా నివేదిక తెప్పించుకుని ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక పంపించాలని సూచించారు. వరి పంటలకు అధికంగా నష్టం జరిగిందన్నారు. ఆమె వెంట వ్యవసాయ అధికారి నిషాంత్ కుమార్, ఏఈఓ తేజ్ కుమార్, రైతులు ఉన్నారు.

శంషాబాద్‌లో భరోసా సెంటర్

- రేపు ప్రారంభించనున్న డీజీపీ శివధర్ రెడ్డి

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొత్త భరోసా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. శుక్రవారం శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో ప్రాంగణంలో కొత్త భరోసా సెంటర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర డీజీపీ పి.శివధర్ రెడ్డి, గౌరవ అతిథిగా తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారు సిన్హా వస్తున్నారని తెలిపారు. మహిళల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వారికి భద్రత కల్పించేందుకే భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని సీపీ వివరించారు. సమాజంలో మైనర్లపై జరుగుతున్న లైంగిక వేధింపులు, హత్యలు, కుటుంబ తగాదాలు, ఇతర కారణాలతో బాధింపబడిన ఆడపిల్లలకు, మహిళలకు భరోసా కేంద్రాల్లో న్యాయం జరిగేలా సైబరాబాద్ పోలీసు యంత్రాంగం పనిచేస్తుందన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టండి

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ పునరావాస చర్యలు చేపట్టాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు, వాటర్ బోర్డు, ఆర్అండ్‌బీ, విద్యుత్, మున్సిపల్ అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వరద నీరు ప్రవేశించిన లోతట్టు కాలనీలు, గ్రామాలను మ్యాపింగ్‌చేసి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు తక్షణ సాయం అందించడంతోపాటు నష్టాన్ని అంచనావేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వరి, కూరగాయల తోటల నష్టం అంచనాలు రూపొందించాలన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లకు మరమ్మత్తులు చేయాలని మంత్రి ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పనులు జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు.

జప్తు చేసిన నిల్వల బహిరంగ వేలం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ కింద పంపిణీ చేస్తున్న బియ్యం, చక్కెర, గోధుమల అక్రమ వ్యాపారం చేస్తుండగా పట్టుబడిన నిల్వలను బహిరంగ వేలం వేస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ చోట్ల జప్తు చేసిన ఈ నిల్వలు హయత్‌నగర్-1, హయత్‌నగర్ -2, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్ గోదాంలలో నిల్వ ఉన్నాయని చెప్పారు. వీటిలో బియ్యం 947.496 మెట్రిక్ టన్నులు, గోధుమలు 25.50 క్వింటాళ్లు, 247 కిలోల చెక్కెరను నవంబరు 18న మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఎక్సైజ్‌శాఖ ద్వారా గుర్తింపు పొందిన బెవరేజ్, డిస్టిలరీ సంస్థల ప్రతినిధుల నుంచి సీల్డ్ కొటేషన్, డాక్యుమెంట్ల యుక్తంగా అధీకృత డీలర్‌షిప్, జీఎస్టీ, డీడీ రూపంలో కోరబడుతుందన్నారు. కొటేషన్స్ నవంబరు 14న సాయంత్రం 5 గంటల్లోగా తీసుకుంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో సీల్డ్ కొటేషన్లు తెరువబడతాయన్నారు.

ఓంకారేశ్వరస్వామి ఆలయం ధూపదీపాలకు దూరం



నందివనపర్తి పరిధిలోని ఓంకారేశ్వర స్వామి ఆలయ భూమి

ఆలయ భూములున్నా నిత్య పూజలకు ఇబ్బందులు

- కౌలు చెల్లించని రైతులు
- నెలకు రూ. 20వేలు అందిస్తున్న కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్తలు

యాచారం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం నందివనపర్తి పరిధిలో ఉన్న శ్రీఓంకారేశ్వర స్వామి ధూపదీప నైవేద్యాలకు నోచుకోవడం లేదు. వందల ఎకరాల ఆలయ భూములున్నప్పటికీ కనీస పూజలకు నోచుకోవడం లేదు. ఆలయ భూములను రైతులు సాగు చేసుకుంటున్నా పైసా కౌలు చెల్లించకపోవడంతో ఆలయ నిర్వహణ భారంగా మారింది. శ్రీఓంకారేశ్వర స్వామివారి ఆలయానికి మండల పరిధిలోని నందివనపర్తి, నజ్దిక్‌సింగారం. తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల మధ్య 1450 ఎకరాల భూములున్నాయి. ఈ భూముల విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.2వేల కోట్ల మేర ఉంటుంది. వీటిని ఆయా గ్రామాలకు చెందిన 845 మంది రైతులు ఏళ్లతరబడిగా సాగు చేసుకుంటున్నారు. అధిక శాతం రైతులు సంవత్సరాలుగా కౌలు చెల్లించడం లేదని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల 15మంది రైతులు రూ.20వేల కౌలు చెల్లించారు. ఆలయ భూములకు ఎకరానికి రూ.60 నుంచి రూ.80 కౌలు చెల్లించాలని కోరుతున్నా

మిగతా 8వ పేజీలో...



ఓంకారేశ్వర స్వామి ఆలయం



కౌలు చెల్లించి నిత్యపూజలకు సహకరించండి

రైతులు ఆలయానికి ఇవ్వాల్సిన కౌలు చెల్లించి ఆలయంలో నిత్య పూజలు జరిగేలా రైతులు సహకరించాలి. ఇటీవల 15మంది రైతులు కేవలం రూ. 20వేలు ఇచ్చారు. మిగిలిన రైతులు కౌలు చెల్లించాలని కోరుతున్నాం. టీజీఐఐసీ ఈ భూములు సేకరించకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

శ్రీనివాస్‌రావు, ఆలయ ఈవో

శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర కృషి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ వ్యవస్థ నిరంతరం శ్రమిస్తుందని, నేరాల అదుపునకు ప్రజలు కూడా సహకరించినప్పుడే ప్రశాంత వాతావరణం నెలకొంటుందని మహేశ్వరం డీసీపీ డి. సునీతారెడ్డి అన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేస్తూ ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మహేశ్వరంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసులతో సహా సుమారు 300 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ జానకిరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, సీతారాం, రాఘవేందర్‌రెడ్డి, సుధాకర్, ఎస్సైలు ప్రసాద్ తో పాటు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరులైన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

ఇబ్రహీంపట్నం : విధి నిర్వహణలో అమరులైన పోలీస్ కుటుంబాలకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి అన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టించేందుకు పోలీస్ బలగాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. శిబిరంలో 200 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు ఎం.మహేందర్‌రెడ్డి, రవికుమార్, నందీశ్వర్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

బంజార పాటల సీడీ ఆవిష్కరణ

ఆమనగల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమానాయక్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నవీన్‌యాదవ్‌కు మద్దతుగా రూపొందించిన బంజారా పాటల సీడీని గురువారం హైదరాబాద్‌లో నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్‌తో కలిసి కడ్తాల్ మండలానికి చెందిన హనుమానాయక్ ఆవిష్కరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలల బంద్



కళాశాలల బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌సిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలో చేపట్టిన కళాశాలల బంద్ విజయవంతమైంది. ఇంటర్మీడియట్, డిగ్రీ, పారా మెడికల్ కళాశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఏర్పుల తరంగ్ మాట్లాడుతూ.. రూ.8500కోట్ల ఫీజు బకాయిలు ప్రభుత్వ విడుదల చేయాల్సి ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండేళ్ల బకాయిలు విడుదల చేయలేదని, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు పై చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు కాగా గురునానక్ యూనివర్సిటీలోకి ఎస్ఎఫ్ఐ నాయకులను అనుమతించకపోవడంతో మెయిన్ గేటు దూకి వెళ్లి విద్యార్థులను కలిసి ఉద్యమానికి సహకరించాలని నాయకులు కోరారు. ఈ బంద్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు శంషీ, శ్రీకాంత్, రాంచరణ్, అజయ్, జస్వంత్ తదితరులున్నారు.

రేపు ఎన్టీఆర్ కుటీరానికి నారా భువనేశ్వరి రాక



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీన్ రామారావు తదితరులు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డు పరిధిలోని ఎన్టీఆర్ కుటీరానికి ట్రస్ట్ మేనేజింగ్ చైర్మన్ నారా భువనేశ్వరి రేపు(శనివారం) రానున్నట్లు ఎన్టీఆర్ విద్యా సంస్థల డీన్ రామారావు తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డులోని ఎన్టీఆర్ కుటీరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అండ్ కల్చర్ ఫెస్ట్ పేరిట జిల్లాస్థాయి క్రీడల పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫెస్ట్‌లో రంగారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు. పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ పోటీలను ప్రారంభోత్సవానికి నారా భువనేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగు గతంలో ఎన్టీఆర్ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించి ఉన్నతస్థాయిలో స్థిరపడిన వారికి సన్మాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే. రెడ్డి, సిబ్బంది మట్టయ్య పాల్గొన్నారు.



7

ముంచిన బంతి

- కిలో రూ.10 కూడా పలకని ధర
- కూలీ, రవాణా ఖర్చుల భారం
- పూలను కోసేందుకు ఇష్టపడని రైతులు

బ్రిడ్జిపై నెలల తరబడి బారికేడ్లు



తాండూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ రోడ్డులోని కాగ్నా నది బ్రిడ్జిపై పడిన భారీ రంధ్రాన్ని జూలైలో ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ పూడ్చివేశారు. అయితే మరమ్మతుల సమయంలో పెట్టిన బారికేడ్లను అధికారులు ఇప్పటికీ తీయలేదు. దీంతో తాండూరు-కొడంగల్ జాతీయ రహదారిపై వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఇరుకై ఇక్కట్లు తలెత్తుతున్నాయి. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది.

చోరీ సొత్తు కొంత రికవరీ

- 2022లో ఐసీఎల్ కర్మాగార క్వార్టర్స్‌లో 65 తులాల బంగారం అపహరణ
- కోర్టు ద్వారా 23 తులాల అప్పగింత
- దర్యాప్తు కొనసాగుతోందన్న ఎస్పీ


ఐసీఎల్ కర్మాగారంలో దొంగతనం జరిగిన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రషీద్(ఫైల్)

తాండూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం మల్కాపూర్ ఇండియా సిమెంటు కర్మాగారంలోని ఐసీఎల్ క్వార్టర్స్‌లో 2022 డిసెంబర్ 29న జరిగిన భారీ చోరీ కేసులో పోలీసులు కొంత పురోగతి సాధించారు. అప్పట్లో కర్మగార సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి విధులు నిర్వహిస్తుండగా అర్ధరాత్రి ఇంట్లో 65తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై అప్పటి అడిషనల్ ఎస్పీ రషీద్ విచారణ జరిపారు. కేసును పరిశీలించారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం ప్రొద్దుటూర్‌లో ఉంటోంది. చోరీ జరిగిన మూడేళ్ల తర్వాత పోలీసులు పురోగతి సాధించారు. అంతర్రాష్ట్ర ముఠా చోరీ చేసినట్లు క్రైమ్‌పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో క్రైమ్ టీమ్ దర్యాప్తు జరిపి మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక నిందితుడిని పట్టుకొని అతడి నుంచి 23తులాల బంగారాన్ని రికవరీ చేశారు. మరి కొందరు నిందితులు ఇతర రాష్ట్రాల్లో ఉన్నందున క్రైమ్ టీమ్ ఆయా రాష్ట్రాలకు వెళ్లి నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తోంది. రికవరీ చేసిన 23తులాల బంగారాన్ని కోర్టు ద్వారా చంద్రశేఖర్‌రెడ్డికి అప్పగించినట్లు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆంధ్రజ్యోతితో తెలిపారు. బంగారాన్ని పూర్తిస్థాయిలో రికవరీ చేసేందుకు క్రైమ్ టీం గుజరాత్‌కు వెళ్తున్నట్లు వెల్లడించారు. అప్పట్లో సంచలనం రేపిన ఈ చోరీ కేసుపై పోలీసులు సవాల్‌గా స్వీకరించి నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నలు చేశారు. ఈ కేసు విషయమై గురువారం జిల్లా ఎస్పీ కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక పోలీసులతో సమీక్షించారు. తాండూరులో ఇటీవల జరిగిన రెండు చోరీలతో పాటు పెద్దేముల్ మండలం కందనెల్లిలో జరిగిన దొంగతనంపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. చోరీల్లో దొంగలు తమ ఫింగర్ప్ ప్రింట్లు దొరకకుండా, సీసీ కెమెరాలకు చిక్కకుండా జాగ్రత్తగా వ్యవహరించారు. అందరు నిందితులను పట్టుకునేందుకు జిల్లా పోలీసులు వివిధ రాష్ట్రాలకు తరచూ వెళ్లివస్తూనే ఉన్నారు.

పేదలను ఆదుకునేందుకే ఇందిరమ్మ ఇళ్లు


'ఇందిరమ్మ' గృహ ప్రవేశంలో వజ్రేశ్‌యాదవ్, నాయకులు

శామీర్‌పేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నిరుపేదలను ఆదుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకంతో ఇండ్లు కట్టిస్తోందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లికి ముఖ్య అతిథిగా వజ్రేశ్ యాదవ్ వచ్చి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, హౌసింగ్ డీఈ అశోక్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌లతో కలసి లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ గృహ ప్రవేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకొనేందుకు ఒక్కో ఇంటికి రూ.5లక్షలను అందజేస్తోందని వివరించారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, ఆర్పీఏ జిల్లా సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశ్, సీనియర్ నాయకుడు తున్కి భిక్షపతి, మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైల్వార్‌ను సందర్శించిన డీఎల్పీవో


డీఎల్‌పీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

బషీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మైల్వార్ గ్రామాన్ని తాండూరు డీఎల్‌పీవో ప్రవీణ్‌కుమార్ గురువారం సందర్శించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం 235 సర్వే నంబర్‌లో కొంత భూమి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అక్రమించారనే ఫిర్యాదుపై కార్యదర్శి నర్సింహగౌడ్‌ను అడిగి ఆరా తీశారు. డీఎల్‌పీవో అక్కడికి వెళ్లి పరిశీలించారు. గ్రామస్తులతో సమావేశమై విచారించారు. ఇందులో కార్యదర్శి ప్రమేయం లేదని నాయకులు, ప్రజలు రాత డీఎల్‌పీవోకు రాతపూర్వకంగా తెలిపారు. డీఎల్‌పీవోతో ఎంపీవో జయకర్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన చైర్మన్లు


నారాయణరావుతో సమావేశమైన ఏఎంసీ, సొసైటీ చైర్మన్లు, నాయకులు

బషీరాబాద్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఏఎంసీ, సొసైటీ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావును గురువారం బషీరాబాద్‌లోని నివాసంలో కలిశారు. మాజీ ఎమ్మెల్యే నాయకులతో స్థానిక రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం. రానున్న స్థానిక ఎన్నికల దృష్ట్యా పలు అంశలపై ఆరా తీసినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలోఏఎంసీ, సొసైటీ చైర్మన్లు జి.మాధవరెడ్డి, ఎ.వెంకట్‌రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిల్‌గౌడ్ ఉన్నారు.

టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన



టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మేఘన

కోట్‌పల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోట్‌పల్లి డాక్టర్ మేఘన తెలియజేశారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం ఇందోల్ పంచాయతీ కార్యాలయం వద్ద టీబీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రక్తపోటు, ఓల్డ్ టీబీ, మధుమేహం, ఆల్కహాల్, ధూమపానం ఉన్న వారికి స్క్రీనింగ్ చేసి టీబీ లక్షణాలుంటే ఎక్స్‌రే, కంటి పరీక్ష చేయించామన్నారు. వ్యాధి ఉంటే 6 నెలల వరకు ఉచిత మందులు, నెలకు రూ.వెయ్యి ఆర్థిక సాయం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖయ్యూం, ల్యాబ్ టెక్నీషియన్ నర్సింలు, ఎమ్ఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎమ్ అపర్ణ, అశోక్, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఆశాలు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. అవుశాపూర్‌లోని తన నివాసంలో తత్వమసి సేవా సమాజం ఆధ్వర్యంలో శబరిమలలో ఏర్పాటు చేసే అన్నప్రసాద వితరణ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. తత్వమసి సేవా సమాజం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు మురళి, జైహింద్‌గౌడ్, చంద్రం, నాగరాజు, శంకర్, వెంకటేష్, దర్శన్ ఉన్నారు.

నగరేశ్వరాలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం


పూజలు నిర్వహిస్తున్న పూజారులు

తాండూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాండూరు వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరేశ్వర స్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పరమేశ్వరుడి తరుపున సింగంశెట్టి శోభ-పద్మనాభం, పార్వతీదేవి తరుపున కొత్రిక నాగలక్ష్మి-శ్రీకాంత్ దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న కల్యాణ వేడుకలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఉదయం నుంచి నగరేశ్వర ఆలయంలో దేవతా విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.


పార్వతీపరమేశ్వరుల కల్యాణంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

అనురాగ్ హెచ్‌వోడీకి జాతీయ స్థాయి అవార్డు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ హెచ్‌వోడీ మల్లికార్జున్ రెడ్డికి భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్-2025 అవార్డు వచ్చింది. ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్(ఏఐ)లో మల్లికార్జున్‌రెడ్డి అసాధారణ నాయకత్వం, విద్యా ప్రతిభ, నూతన ఆవిష్కరణల అధారిత బోధన, ప్రభావవంతపరిశోధనల పట్ల ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. భారత ఎడ్యుడకేషన్ ఎక్సలెన్స్ జాతీయస్థాయి అవార్డును ఎంఎల్లార్ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, జేఎన్టీయూ వైస్ చాన్సలర్ సీఎస్‌అర్‌కే ప్రసాద్, ఏఐసీటీఈ ప్రతినిధి చంద్రశేఖర్, టీసీఎస్ ప్రతినిధి బాలప్రసాద్ మల్లికార్జున్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మల్లికార్జున్‌రెడ్డికి ఎక్సలెన్స్ అవార్డును అందజేస్తున్న వీసీ ప్రసాద్

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

షాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర హాకీ ఫెడరేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. షాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు వారు మద్దతు తెలిపారు. దీక్షలు గురువారంతో 19వ రోజుకు చేరాయి. దీక్షలో వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు మల్లికార్జున్, నవీన్, రాజేష్, విశ్వనాథం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. దేశ జనాభాలో సగం బీసీలు ఉన్నారని, వారికి రిజర్వేషన్లు న్యాయబద్ధమైనవే అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రాజేందర్‌గౌడ్, వెంకట్, రవీందర్, రమేశ్, నర్సింహులు, అశోక్, చెన్నయ్య, రాము, రాజు, సత్యనారాయణ, రాములు, మల్లేష్, వెంకటయ్య పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో రాష్ట్ర హాకీ ఫెడరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్



సీఎంకు రాసిన పోస్టుకార్డులను చూపుతున్న జేఏసీ నాయకులు, ప్రజలు

విద్యా సంస్థలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలి

» సీఎంకు పోస్టుకార్డులు రాసి జేఏసీ నిరసన

కొడంగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ కో-కన్వీనర్లు ఎరన్‌పల్లి శ్రీనివాస్, మాసాని వెంకటయ్య కోరారు. గురువారం జేఏసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన కార్డులను పోస్టుబాక్సుల్లో వేశారు. వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనకబడిన కొడంగల్ ప్రాంతంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్ లాహోటి, బస్వరాజ్, పకీరప్ప, చిన్నయ్య, నవీన్‌సింగ్, మదన్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షలకు అనుమతివ్వాలని ఎస్పీకి వినతి

మెడికల్ కాలేజీ, గురుకులాలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 1 నుంచి కొడంగల్‌లో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. నిరాహార దీక్షకు అనుమతివ్వాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలో ఎస్పీ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జి.సురేశ్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్ బాబు, భీమరాజు, సూర్యనాయక్, డాక్టర్ నవాజ్ పాల్గొన్నారు. అలాగే పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌కు సైతం వినతిపత్రం ఇచ్చామని తెలిపారు.

పెండింగ్ పీఆర్సీని వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 2023 జూలై నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, లేకుంటే డిసెంబరు 9 తర్వాత కార్యాచరణకు దిగుతామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయు టీఎస్) రంగారెడ్డి జిల్లా సర్వసభ్య సమావేశాన్ని బుధవారం కాటేదాన్‌లో నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు పి.రాఘవేందర్‌ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను తొలగించాలన్నారు. పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భిక్షంగౌడ్, బి.జగన్ మోహన్‌గుప్తా, పి.వెంకటరెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్‌గౌడ్, సుశీల, కరుణ, పద్మ, సుదర్శన్, శ్రీనివాస్‌సాగర్, మాణిక్యంరెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్‌యాదవ్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఉచిత బ్యాంక్ ఖాతాలు



మాట్లాడుతున్న పీఎన్బీ మేనేజర్ కనకదాస్

వికారాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల కోసం ప్రత్యేకంగా ఉచిత కరెంట్ అకౌంట్ సదుపాయం కల్పిస్తున్నామని పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ కనకదాస్ తెలిపారు. గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో వికారాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులకు ఉచిత కరెంట్ అకౌంట్లు అందజేసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. అకౌంట్ ఓపెన్ చేసిన వారికి చెక్‌బుక్, ఏటీఎం కార్డు, క్యూఆర్ కోడ్ ఉచితంగా ఇస్తామని, అదనంగా లాకర్ సదుపాయం, గృహరుణం వంటి సేవలు కూడా అందిస్తామన్నారు. ఈ ఖాతాలకు మినిమమ్ బ్యాలెన్స్ అవసరం లేదని, ఎటువంటి చార్జీలు విధించమని, న్యాయవాదులకు క్యూఆర్‌కోడ్ స్వైప్ మిషన్లను కూడా ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు వికారాబాద్‌లో 45మంది న్యాయవాదులు ఖాతాలు తెరిచారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, శిరీష, న్యాయవాదులు లవకుమార్, కమాల్‌రెడ్డి, యాదవరెడ్డి, నాగరాజు, రాంచందర్‌రావు, శుక్లవర్ధన్‌రెడ్డి, రఫీ,డి.లక్ష్మణ్, అశోక్‌కుమార్, ఖయ్యూం, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రాకేశ్ కిషోర్‌ను అరెస్ట్ చేయాలి

తలకొండపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీజేఐ బీఆర్.గవాయ్‌పై దాడిచేసిన న్యాయవాది రాకేశ్‌కిషోర్‌ను అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. మండల పరిధి వెల్జాలలో గురువారం నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తుడుం శ్రీను ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నవంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే 'హలో దళిత్-చలో హైదరాబాద్' కార్యక్రమ విజయవంతంపై చర్చించారు.

ఆమనగల్లులో సన్నాహక సమావేశం

ఆమనగల్లు: సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ ఆమనగల్లు మండలాధ్యక్షుడు శ్రీశైలం కోరారు. పట్టణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

విమాన ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

● అపోలో ఆసుపత్రికి తరలింపు ..

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదె రవి అనే ప్రయాణికుడు 6ఈ1407 అబుదాబికి వెళ్లేందుకు గురువారం విమానం ఎక్కాడు. విమానం టేకాఫ్ సమయంలో ఊపిరాడటం లేదని సిబ్బందికి తెలిపాడు. దీంతో విమానాన్ని తిరిగి 26ఏ గేటు వద్దకు తీసుకెళ్లి ప్రయాణికుడిని దింపి ఏఎంసీ సిబ్బందికి అప్పగించారు. రవిని అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రవి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వ్యక్తి అదృశ్యం

● 400 డాలర్లు ఇస్తేనే విడిచిపెడతామని దుండగుల ఫోన్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):థాయిలాండ్‌కు వెళ్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కనకయ్య తెలిపిన వివరాల మేరకు.. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌నకు చెందిన మధును ఈ నెల 16న అతడి సోదరుడు పరశురామ్ ఎయిర్‌పోర్టులో వదిలిపెట్టాడు. 22న వరకు ఫోన్‌లో అందుబాటులో ఉన్న మధు అనంతరం అందుబాటులోకి రాలేదు. విదేశాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి 'మీ అన్న డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడు. 400 డాలర్లు ఇస్తేనే వదుల్తాం.' అని చెప్పారని కుటుంబ సభ్యులను డిమాండ్ చేశారు. దీంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కనకయ్య తెలిపారు.

ముంచిన బంతి

కిలో రూ.10 కూడా పలకని ధర

కూలి, రవాణా ఖర్చుల భారం

పూలను కోసేందుకు ఇష్టపడని రైతులు

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బంతి తోటలు సాగుచేసిన రైతులకు ఈ సంవత్సరం నష్టం వచ్చింది. కొత్తగూడ, కందుకూరు, నేదునూరు, జైత్వారం, కొత్తూరు తదితర గ్రామాల్లో 50ఎకరాల్లో రైతులు బంతి తోటలు వేశారు. గతేడాది దీపావళికి కిలో 80రూపాయల వరకు పలికిన ధర ఈసారి పడిపోయింది. రైతులు ఆశించిన ధర రాక నష్టాలపాలయ్యారు. దీపావళి పండుగ మూడురోజుల పాటు కిలో రూ.60 నుంచి 70 వరకు ధర ఉంది. పండుగ ముగిసినా కార్తీక మాసంలో బంతిపూలకు ధర ఉంటుందని రైతులు భావించారు. అయితే ఇప్పుడు కిలో బంతి ధర రూ.10కి పడిపోయింది.



తుఫాన్‌తో మరిన్ని ఇబ్బందులు

అక్టోబరు నెలలో వరుసగా తుఫాన్ వర్షాలతో బంతిపూలను మార్కెట్‌కు తరలించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్‌లోని గుడిమల్కాపురం మార్కెట్‌కు బంతిపూలు తరలించినా గిట్టుబాటు ధర రావడం లేదు. కిలోకు పది రూపాయలైనా రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్నిసార్లు అమ్ముడుపోక మార్కెట్‌లో పారబోసి వస్తున్నారు. పూలు తెంపేందుకు, మార్కెట్ రవాణాకయ్యే ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.



జైత్వారంలో బంతి తోట



గతంలో ఇలాంటి పరిస్థితి లేదు

నేను పదేళ్లుగా బంతి, చామంతి తోటలు సాగుచేస్తున్నా. బంతికి ఎప్పుడైనా కిలోకు రూ.20పైనే ఉండేది. ఈ సంవత్సరం బంతికి ధర లేక కూలీల, రవాణ ఖర్చులైనా రావడం లేదు. దీంతో తెంపకుండా వదిలేస్తున్నా. ఇలాంటి దుర్భర పరిస్థితి నేను ఎప్పుడూ చూడలేదు. ప్రభుత్వం పూలు, కూరగాయ రైతులకు మద్దతు ధరొచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- సింగిరెడ్డి నర్సింహారెడ్డి, పూల రైతు, కొత్తగూడ

ఇంట్లోనే నిర్ధారణ పరీక్షలు

అందుబాటులోకి .. ఆధునిక వైద్య పరికరాలు

» త్వరితగతిన వ్యాధి నిర్ధారణ

» టెక్నాలజీతో తగ్గుతున్న వైద్య ఖర్చులు

» సమయం, డబ్బు ఆదా

చేవెళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్య విజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు రోజూ పరీక్షలు అవసరం. వాటి నిర్ధారణకు క్లినిక్‌లకు పరుగులు తీసే పని లేకుండా ఇంట్లోనే పరీక్షించుకునే వైద్య పరికరాలు లభ్యం అవుతున్నాయి. చేవెళ్ల డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఈ పరికరాలను విస్తృతంగా వాడుతున్నారు. స్థానిక మెడికల్ షాపుల్లోనూ అమ్ముతున్నారు. నిమిషాల వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణ జరుగుతోంది. రోగులు ఆస్పత్రులకు పరుగులు తీసే బాధ తప్పింది. సమయం, డబ్బు ఆదా అవుతాయి. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగి ప్రతీ చిన్నదానికి ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలకు పరుగులు తీయకుండా ఇంట్లోనే వైద్య పరీక్షలు చేసుకుంటున్నారు.



షుగర్ వ్యాధిగ్రస్తుల కోసం ..

మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజూ రక్తంలో షుగర్ శాతాన్ని తెలుసుకుంటూ రక్తంలో గ్లూకోజ్ స్థాయిని అదుపులో పెట్టుకోవాలి. లేదంటే షుగర్ లెవల్స్ పెరిగి గుండె, కిడ్నీ, కళ్లు తదితర శరీర అవయవాలు పాడయ్యే ప్రమాదం ఉంది. ఇప్పుడు గ్లూకోమీటర్ మార్కెట్‌లో లభిస్తోంది. దీనితో సెకన్ల వ్యవధిలోనే రక్తంలో షుగర్ లెవల్స్ తెలుసుకోవచ్చు. సూది గుచ్చుకున్నంత నొప్పి మాత్రమే ఉంటుంది. ఎక్కువ రక్తం తీయకుండా ఒక్క రక్తం చుక్కతో షుగర్ లెవెల్స్ తెలుసుకోవచ్చు.

ఎలక్ట్రానిక్ బీపీ మీటర్లు

రోజురోజుకూ బీపీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. రక్తపోటు తెలుసుకుని దాని నియంత్రణకు మందులు వాడాలి. బీపీ నిర్ధారణకు ఆస్పత్రికి వెళ్లే పనిలేకుండా ఇంట్లోనే పరీక్ష చేసుకునేందుకు ఎలక్ట్రానిక్ బీపీ మిషన్‌తో రక్తపోటు, గుండె కొట్టుకునే రేటు తెలుస్తాయి. ఈ విధానంలో కచ్చితత్వం కూడా ఎక్కువే!

గర్భ నిర్ధారణ పరీక్ష

గర్భం వచ్చిందా.. లేదా? అని నిర్ధారణ చేసే పరీక్షను ఇళ్ల వద్దనే చేసుకోవచ్చు. వన్ స్టెప్ ప్రెగ్నెన్సీ టెస్ట్ డివైస్ ద్వారా ఈ పరీక్ష సులువుగా చేస్కోవచ్చు. మహిళ యూరిన్ ఒకచుక్క స్ట్రిప్‌పై వేస్తే దానిపై ఒక్క ఎర్రగీత కనిపిస్తే గర్భం రానట్టు. ఎర్ర గీతలు రెండు కనిపిస్తే గర్భం దాల్చినట్టు లెక్క.



ఆస్తమా రోగుల సౌకర్యార్థం..

చలికాలంలో ఆస్తమా రోగులను సమస్య తీవ్రంగా వేధిస్తుంది. దమ్ముతో పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడతారు. ఈ వ్యాధి ఉన్న వారికి రాత్రి నిద్రపోయేందుకు ఇబ్బంది ఉంటుంది. అలాంటి సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లకుండా ఇంట్లోనే ఊపిరితిత్తుల్లో ఉన్న ఇన్ఫెక్షన్‌ను తగ్గించేందుకు నెబిలైజర్ అనే వైద్య పరికరం ఉపయోగపడుతోంది.

నడవలేని వారికి...

పక్షవాతం వచ్చి నడవలేక మంచానికే పరిమితమయ్యే వారికి, ప్రమాదాల్లో వెన్నుపూస దెబ్బతిన్న వారిని మల,మూత్ర విసర్జనకు తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు ఇబ్బంది పడతారు. వారి సమస్యలు తీర్చేలా ఆధునిక వీల్‌చైర్లు వచ్చాయి. వీటిల్లో మల, మూత్రాలను పట్టేందుకు కింద భాగంలో చిన్న బకెట్/బేసిన్లు అమర్చుతారు. వాటిని వినియోగించిన తరువాత శుభ్రం చేసి మళ్లీ అమర్చొచ్చు. మడత కుర్చీలపై పండుకున్నట్టు నడుము వాల్చేలా వీల్‌చైర్లు ఉన్నాయి. 150కిలోల బరువు ఉన్న వారు సైతం వీటిపై కూర్చునేలా ధృడంగా తయారు చేశారు.



వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి



బీపీ, షుగర్ వంటి జబ్బులకు ఆధునిక వైద్యపరికరాలు అందుబాటులోకి రావడం మంచిదే. రోగులు రోజూ ఈ పరీక్షలు చేయించుకోవాలి కాబట్టి ఇంటి వద్దే రిపోర్ట్ తెలుసుకునే అవకాశం ఉంది. ఆధునిక వైద్య పరికరాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోంది. ఇళ్ల వద్దే కొన్ని వైద్య పరీక్షలు సొంతంగా చేసుకొని మందులు తీసుకోడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అయితే దీర్ఘకాలిక రోగులు అప్పుడప్పుడు వైద్యులను సంప్రదించి వారి పర్యవేక్షణలో మందులు వాడాలి.

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్, చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి

ఆరోగ్యంపై అవగాహన పెరిగింది



డిజిటల్ బీపీ ఆపరేటర్లు, షుగర్ పరీక్షలు చేసుకునే గ్లూకోమీటర్లు రావడంతో ప్రజల్లో వ్యాధులపై అవగాహన పెరిగింది. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తరుచూ పరీక్షలు చేయించుకోవాలి. గతంలో వైద్య పరికరాలు లేక, ప్రజల్లో అవగాహన అంతగా లేక ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ డిజిటల్ వైద్య పరికరాలను కొంటున్నారు. చాలా మంది బీపీ, షుగర్ మిషన్లతో ఇంట్లోనే చెక్ చేసుకుంటూ వాటిని అదుపులో పెట్టుకుంటూ ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు.

- డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యుడు, చేవెళ్ల

బీటీ వేయరూ?

రెండేళ్లుగా రోడ్డు కోసం ఎదురుచూపులు

» కంకర పోసి వదిలేసిన కాంట్రాక్టర్

» అయోధ్యనగర్ కాలనీ వాసుల ఇక్కట్లు

తాండూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం పోలీస్ స్టేషన్ నుంచి సాయిపూర్ తాతాగుడి మీదుగా హైదరాబాద్ రోడ్డుకు కలిపే సీసీ, బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచాయి. రెండేళ్ల క్రితం రూ.3కోట్ల నిధులు మంజూరు కాగా 3కి.మీ రోడ్డు వేయాల్సి ఉంది. పోలీస్‌స్టేషన్ నుంచి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వరకు రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్డు వేశారు. కృష్ణవేణి స్కూల్ నుంచి సాయిపూర్ హనుమాన్ ఆలయం వరకు సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. అక్కడి నుంచి తాతగుడి మీదుగా కట్టమైసమ్మ ఆలయం నుంచి అయోధ్యనగర్ కాలనీల మధ్య హైదరాబాద్ రోడ్డును కలుపుతూ రూ.2కోట్ల మేరకు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. రెండేళ్ల క్రితం ఆ రోడ్డు మార్గంలో కంకర, దానిపై ఎర్రమట్టి వేసి వదిలేశారు. కాంట్రాక్టర్ బీటీ రోడ్డు వేయలేదు. దీంతో కాలనీ రోడ్లపై పెద గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులకు, కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డు పనులు పూర్తయితే సాయిపూర్ మీదుగా బైపాస్‌లో హైదరాబాద్ రోడ్డు పెట్రోల్ బంక్ వరకు ట్రాఫిక్ సమస్య లేకుండా వెళ్లొచ్చు. ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు చేయడంలేదు. ఇప్పటికైనా పనులు పూర్తిచేసి రోడ్డును అందుబాటులోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



తాండూరు-సాయిపూర్ అయోధ్యనగర్ కాలనీలో బీటీ వేయకుండా వదిలేసిన రోడ్డు

అన్నదాతలు అధైర్యపడొద్దు

» పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భరోసా



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు, కల్వకుర్తి, వెల్దండ మండలాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. మొంథా తుపాన్ వల్ల గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి, వరి పంటలను పరిశీలించారు. రంగుమారిన పత్తిని ప్రభుత్వం కొని తమను ఆదుకోవాలని రైతులు కోరారు. రైతులు ఆందోళన చెందొద్దని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. తడిసిన పత్తి కొనుగోలు చేసేలా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకుపోతానన్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టాలపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రోడ్లు, చెరువుకుంటల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. చెరువు కుంటల్లోకి వరద వస్తున్నందున ప్రమాదాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని నారాయణరెడ్డి సూచించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ మెంబర్ ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, బిచ్యానాయక్, సీనియర్ నాయకులు కాసు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, భూపతిరెడ్డి, ఆనంద్, శ్రీకాంత్‌రెడ్డి, పర్వతరెడ్డి, మోతీలాల్, అజీజ్,వెంకటేశ్‌రెడ్డి, అంబాజీ పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలు

తలకొండపల్లి: పంట ఉత్పత్తులకు మద్దతు ధర ఇచ్చేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. రైతులు వాటిల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. గురువారం పడకల్‌లో ప్యాక్స్ ఆధ్వర్యంలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,400 ధర ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఏడీఏ శోభారాణి, ఏవో రేణుకచక్రవర్తి, ప్యాక్స్ సీఈవో ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, జగ్గారెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొండాకల్‌లో నూతనంగా నిర్మించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి, బీరప్ప, కొండపోచమ్మ ఆలయాల్లో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గోపూజ, ఆలయ ముఖ మండపం, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, యాగశాల సంస్కారం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమం తదితర పూజలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. గ్రామస్తులు పెద్దఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అవసరాలకు అనుగుణంగా ... టూలింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు

» జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌తో ఆర్‌హెచ్ ఏరో సంస్థ వ్యూహాత్మక భాగస్వామ్యం



శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ ఏవియేషన్, ఆర్‌హెచ్ ఏరో సంస్థతో వ్యూహాత్మక భాగస్వామ్యంతో విమాన మెయింటెనెన్స్, ఇంజనీరింగ్‌లో ప్రతిష్ఠాత్మక కేంద్రంగా నిలుస్తుందని జీఎంఆర్ ఏరో టెక్నిక్ అధ్యక్షుడు అశోక్ గోపినాథ్ అన్నారు. జీఎంఆర్ ఏరో టెక్నిక్ భారత్‌లో ప్రవేశించిందన్నారు. దేశంలో ప్రముఖ ఎయిర్ ఫ్రేమ్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ సంస్థగా గుర్తింపు పొందిన ఆర్‌హెచ్ ఏరో ప్రపంచ వ్యాప్తంగా ఏఈఎం లైసెన్స్‌డ్ టూలింగ్, గ్రౌండ్ సపోర్ట్ ఎక్విప్మెంట్, లైవ్ సైకిల్ సేవల్లో అగ్రగామిగా ఉందన్నారు. ఈ భాగస్వామ్యంతో రెండు సంస్థలు ఆర్‌హెచ్‌ఏరో, ఏరోస్పేస్ రంగాల అవసరాలకు అనుగుణంగా టూలింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ ద్వారా నిర్వహిస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధి వైమానికరంగ వికాసానికి, మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి కీలకంగా ఉంటాయని తెలిపారు.

నిషా ముక్త్ భారత్‌గా తయారు చేయాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్

కేశంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిషా ముక్త్ భారత్‌ను తయారు చేయాలని కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. పాపిరెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో డ్రగ్ కల్చర్ పెరగడం ఆందోళనకరమన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేలల్లో గంజాయి సాగుచేస్తున్న సంఘటనలు చూస్తున్నామని తెలిపారు. ఎవరైనా అనుమానస్పద వస్తువును విక్రయిస్తే వెంటనే ఉపాధ్యాయులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్యాసింగ్, జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీశైలం, టీచర్లు కె.గోపాల్‌రెడ్డి, సూర్యకాంత్, సువర్ణ, శ్రీదేవి, శ్రీశైలం, లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

● వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు, నాయకులు



కేశంపేట : మండలం అల్వాలలో దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న ఏవో శిరీష

ఆమనగల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులు అధైర్యపడొద్దు అండగా ఉంటామని ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యవసాయాధికారులు అన్నారు. మొంథా తుఫాన్ కారణంగా ఆమనగల్లు మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ఏఈవోలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం గూర్చి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ ముర్తోజుపల్లిలో తుఫాన్ తాకిడికి రైతు మెండె రాములు వరి పంట దెబ్బతింది. ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

మాడ్గుల : మండలంలోని వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి పంటలను వ్యవసాయాధికారి అరుణ కుమారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

తలకొండపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన తలకొండపల్లి మండలం వెల్జాల సహదేవి సముద్రం చెరువు జలకళను సంతరించుకుంది. ఏకంగా 45 ఏళ్ల తర్వాత చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నాయకులతో కలిసి గంగమ్మకు పూజలు నిర్వహించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. సహదేవి సముద్రం చెరువును బీఆర్ఎస్ జిల్లా నాయకుడు,



మంచాల : ఆరుట్లలో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ సందర్శించారు. రైతులు, స్థానిక నాయకులతో కలిసి గంగమ్మకు పూజలు నిర్వహించారు. వెల్జాల, చౌదర్‌పల్లి, మాదాయిపల్లి, మెదక్‌పల్లి, గట్టిప్పలపల్లి, చంద్రధన రైతులతో చెరువు అలుగువద్ద చీర, సారె సమర్పించి పూజలు చేపట్టారు. చెరువుకు బలివేడుక నిర్వహించారు. బాల కృష్ణయ్య, నరేందర్‌గౌడ్, మోహన్‌లాల్, ముజుబుర్ రహెమాన్, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య క్షేత్రస్థాయిలో పర్యటించారు. గూడూరులో రైతు సుధాకర్‌రెడ్డి, కందుకూరులో సురసాని రాంరెడ్డి, గంగుల నర్సింహారెడ్డిల వరిపంట పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు.

కొందుర్గు : పంట పొలాల్లో వర్షపు నీరు నిలువడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో జొన్న, పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం అందించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

ఇదిలా ఉండగా.. పంటల నష్టంపై అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వివరాలను సేకరించేందుకు కృషి చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మండల ఇన్‌చార్జి రాజేందర్ రెడ్డి సూచించారు.

ఇబ్రహీంపట్నం/యాచారం: సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షాలకు చేతికొచ్చిన వరి పంటలు నేల కొరిగి, నీట మునిగి మొత్తం 151 మంది రైతులకు సంబంధించి 240 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఆయా మండలాల్లో పర్యటించిన అధికారులు ప్రాథమికంగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు. యాచారం మండలం మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి, మేడిపల్లి, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో 85మంది రైతులకు సంబంధించి 165 ఎకరాలు దెబ్బతిని సుమారు రూ.52లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. అలాగే మంచాల మండలంలో 16మంది రైతులకు సంబంధించి 25ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండలంలో 50 మంది రైతులకు సంబంధించి 50ఎకరాల్లో వరి పంటకు నష్టం చేకూరింది. ఇబ్రహీంపట్నం మండలంలో నాగన్‌పల్లి, పోల్కంపల్లి, ఏన్గల్‌గూడ, నెర్రెపల్లి, దండుమైలారం, పోచారం, ఇబ్రహీంపట్నం భగాయత్‌లలో అక్కడక్కడ వరికి నష్టం చేకూరినట్లు అధికారులు చెప్పారు. అక్కడక్కడ కూరగాయ పంటలు నీటి మునిగి స్వల్పంగా నష్టం చేకూరినట్లు రైతులు తెలిపారు.

కాగా, ఎకరం సాగుకు రూ.30వేల నుంచి రూ.32 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేశామని యాచారం మండలంలోని బాధిత రైతులు అధికారులకు వివరించారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రవినాథ్ 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

యాచారం మండలంలోని మేడిపల్లి, చౌదర్‌పల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, ధర్మన్నగూడ, నందివనపర్తి తదితర గ్రామాల్లో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికందే సమయంలో వర్షం పడటంతో పత్తి నల్లగా మారుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులను తక్షణమే ఆదుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్, మాజీ అధ్యక్షుడు తాండ్ర రవీందర్‌లు ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎకరం పంటకు రూ.25వేల పరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో కలెక్టర్‌కు కలిసి ఆదుకోవాలని కోరనున్నట్లు చెప్పారు.

మంచాల : తుఫాను ప్రభావంతో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో కూలిపోయిన పాత ఇళ్లను గురువారం పరిశీలించారు. వర్షాలకు చేతికొచ్చిన వరిపైర్లు దెబ్బతిన్నాయని, పలు పెంకుటిల్లులు కూలిపోయాయని చెప్పారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో బాధితులకు సత్వర పరిహారం అందేట్లు చూస్తామని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మించి ఇస్తామని హామీఇచ్చారు. బుట్టి కృష్ణ, బుగ్గరాములు, మార లక్ష్మన్, మార సురేష్, మానుపాటి వెంకటేష్, నూకం మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి : వర్షాలకు దెబ్బతిన్న పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కాగా, తుఫాన్ ప్రభావంతో మంచాల మండల పరిధిలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారులు చిత్తాపూర్, బోడకొండ, ఎల్లమ్మతండా, దాత్‌పల్లి తదితర గ్రామాల్లో పర్యటించి వర్షాల దాటికి దెబ్బతిన్న పంటచేలను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారి లింగస్వామి మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు.

కేశంపేట : మండలంలో వరిలో 33శాతం కన్నా ఎక్కువగా 157 ఎకరాల్లో నష్టం జరిగిందని వ్యవయసాధికారి శిరీష తెలిపారు. గురువారం మండల పరిధిలోని అల్వాలలో ఏఈవో వినయ్‌తో కలిసి దెబ్బతిన్న వరిపైర్లను పరిశీలించారు. జిల్లా అధికారులకు ప్రాథమిక నివేదిక అందజేస్తామని తెలిపారు.

తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన పి.రాంరెడ్డి రెండు ఎకరాలలో బొప్పాయి సాగు చేస్తున్నాడు, బుధవారం కురిసిన వర్షానికి బొప్పాయి తోటలో చాలా మొక్కలు నేలకొరిగాయి. రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు రాంరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



కొందుర్గు : వర్షానికి తడిసి ముద్దయిన పత్తిని పరిశీలిస్తున్న రైతు



ఆమనగల్లు : ముర్తోజుపల్లిలో దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతు

రైతు గోస పట్టదా?

(ఐదో పేజీ తరువాయి)

పత్తి పంటకే అధికంగా నష్టం జరిగింది. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పంట నష్టం అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉష గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామాన్ని సందర్శించారు. అయితే పంట నష్టం అంచనాలు వేసేందుకు క్షేత్రస్థాయికి వెళుతున్న వ్యవసాయశాఖ అధికారులు నీటమునిగిన పంటతో పాటు నేలకొరిగిన పంటను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. అది కూడా 33శాతానికిపైగా నష్టం జరిగితే లెక్కిస్తున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి కేవలం 475 ఎకరాల్లో మాత్రమే పంట నష్టం జరిగినట్లు తేల్చారు. ఇప్పటి వరకు 10 మండలాల్లో పంటనష్టం తేల్చారు. ఇందులో అత్యధికంగా ఇబ్రహీంపట్నం డివిజన్‌లో పంట నష్టం అధికంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 48 గ్రామాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలోని 315 మంది రైతులకు సంబంధించిన 478 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. ఇందులో అత్యధికంగా 466 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. కేవలం 12 ఎకరాల్లో మాత్రమే పత్తికి నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు.

పత్తి రైతు బతుకు బుగ్గిపాలేనా?

జిల్లాలో కురిసిన వర్షాలకు అధికంగా పత్తి పంటకు ఎక్కువ నష్టం జరిగింది. దాదాపు అన్ని ప్రాంతాల్లో పత్తి పొలాల్లోనే తడిసి ముద్దై నేలరాలిపోతోంది. దాదాపు 50శాతానికిపైగా పత్తి పొలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కానీ పంట నష్టం అంచనాల విషయంలో అధికారులు పత్తి రైతులకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు కేవలం 12 ఎకరాల్లోనే పత్తి పంటకు నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక పంపారు. నీటమునిగి పడిపోయిన పంటను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. అది కూడా 33శాతానికిపైగా మునిగితే లెక్కిస్తున్నారు. కానీ వర్షాలకు నేలరాలిన పత్తిని మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. కోతకు వచ్చిన పంట నేలరాలితే నష్టంగా గుర్తించలేమని అధికారులు చెప్పడం విడ్డూరం. దీంతో వర్షాలకు అధికంగా నష్టపోయిన పత్తిరైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో ఈ సీజన్‌లో అత్యధికంగా 1.80లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. ఇప్పటికే గతంలో కురిసిన వర్షాల వల్ల పత్తి దిగుబడులు తగ్గాయి. పక్షం రోజుల కిందట అధికారులు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో జిల్లాలో దాదాపు 30శాతం పత్తి దిగుబడులు తగ్గుతాయని అంచనా వేస్తూ నివేదిక ఇచ్చారు. గడిచిన నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు పత్తి మరింత దెబ్బతింది. దీంతో 50శాతానికిపైగానే దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. అనేకచోట్ల సగం పత్తి వర్షాలకు తడిసి నేలరాలి నల్లబారుతోంది. ఎండిన తరువాత రాలిన పత్తిని ఏరుకుని మార్కెట్ చేసుకోవడం కష్టమే. ఇప్పటికే పత్తి కొనుగోళ్ల విషయంలో సీసీఐ రైతులను ఇబ్బందులు పెడుతోంది. తేమ అధికంగా ఉందనే నెపంతో దాదాపు కొనుగోళ్లు చేయడం లేదు. ఇపుడు కురిసిన వర్షాలతో మళ్లీ పత్తి రైతుకు మరింత నష్టం జరిగింది.

ఓంకారేశ్వరస్వామి ఆలయం ధూప దీపాలకు దూరం

(ఐదో పేజీ తరువాయి)



నందివనపర్తి ఆలయంలో కొలువైన ఓంకారేశ్వర స్వామి

రైతుల నుంచి స్పందన ఉండటం లేదు. భూములపై తమకు టెనెంట్ 38ఇ ఉందని, తామెందుకు కౌలు చెల్లించాలని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. సుమారు కోటి రూపాయల కౌలు పెండింగ్‌లో ఉన్నట్లు దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

భూముల సేకరణకు యత్నం

కొందరి రాజకీయ నాయకుల అండతో 1,022 ఎకరాల ఆలయ భూములను టీఎస్‌ఐఐసీ అధికారులు సేకరించడానికి యత్నించారు. ఆలయ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇతర అవసరాలకు వాడరాదనే నిబంధన ఉంది. అయితే, ఈ విషయం తెలుసుకున్న జిల్లా దేవాదాయ శాఖ అధికారులు హైకోర్టులో స్టే తేవడంతో భూసేకరణ ఆగిపోయింది.

నిత్య పూజలకు డబ్బుల్లేక..

శ్రీఓంకారేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజల నిర్వహణకు పూజారులు సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు కర్మాన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి ఆలయ నిర్వాహకులు గమనించారు. దాంతో జిల్లా దేవాదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతితో నెలకు రూ.20వేల నిధులను కొంతకాలంగా అందజేస్తున్నారు.

శంషాబాద్‌కు నేడు ఎమ్మెల్యే రాక

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండల పరిధిలో నేడు(శుక్రవారం) ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పర్యటించనున్నారు. మండల పరిధిలోని మల్కారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మేకల ప్రభుసాగర్ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా నూతన గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

గ్రూప్-2 ఉద్యోగం.. కానిస్టేబుల్ ఉమకు సన్మానం



కేశంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కేశంపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఉమ గ్రూప్-2లో ఉద్యోగం సాధించడంతో కేశంపేట మండల బీజేపీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఉమను శాలువాతో సత్కరించి, అభినందించారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ నరేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేష్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, నరేందర్ తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలి



చేవెళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



శంషాబాద్ : మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శంషాబాద్/చేవెళ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్‌మెంట్స్‌తో పాటు బకాయిపడ్డ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు ప్రణయ్ అన్నారు. ఈమేరకు గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రణయ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరేళ్ల నుంచి రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదన్నారు. స్కాలర్స్‌షిప్‌లు చెల్లించడంలో జాప్యం చేస్తుందని దుయ్యబట్టారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్, చందు అన్నారు. చేవెళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల బంద్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్షిప్‌లు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగటం ఆడడం సరికాదన్నారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చందు, ఆకాశ్, విష్ణు, వినయ్, లోకేష్, రిషి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

షాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా గ్రామాల్లో ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం కుమ్మరిగూడలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేసి లబ్ధిదారుకు ప్రొసీడింగ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ : కుమ్మరిగూడలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న భీంభరత్ తదితరులు

సొంతింటి కల సాకారం



కడ్తాల్ : ప్రొసీడింగ్స్ అందిస్తున్న భాస్కర్‌రెడ్డి

కడ్తాల్ : ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల దశాబ్దాల సొంతింటి కల సాకారమైందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో పలువురు నిరుపేదలకు మంజూరైన ఇళ్ల ప్రొసిడింగ్‌లను గురువారం స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు బాస్కర్‌రెడ్డి అందజేశారు. పలువురి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. నాయకులు జహంగీర్ అలీ, గురిగళ్ల లక్ష్మయ్య, జహంగీర్‌బాబా, భిక్షపతి, యాదయ్య, బుచ్చయ్య, మల్లయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు గంట నరేశ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ముద్విన్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం ముద్విన్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లు అందజేశారు. నాయకులు నర్సింహ, శ్రీశైలం, ప్రవీణ్, వెంకటయ్య, మల్లేశ్, తదితరులున్నారు.

నిబంధనల మేరకు నిర్మించాలి

ఆమనగల్లు : లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. కోనాపూర్‌లో గురువారం ఎంపీడీవో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్లు, అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యదర్శి రమ్య, ఏపీవో మాధవ రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన వెంకట్‌రెడ్డి



కోమటిరెడ్డికి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందిస్తున్న వెంకట్‌రెడ్డి

తలకొండపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు ఏదుల్ల వెంకట్‌రెడ్డి గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వేంకటేశ్వరస్వామి ప్రతిమను మంత్రికి బహూకరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పలు బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వపరంగా నిదులు మంజూరు చేయించాలని కోరినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. అలాగే కడ్తాల-తలకొండపల్లి రోడ్డులో అటవీశాఖ అభ్యంతరం మూలంగా నిలిచిపోయిన రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డుకు అటవీ శాఖ నుంచి అనుమతి ఇప్పించి పూర్తిచేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

ఆమనగల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ గోదాదేవి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యంలు ఆడబిడ్డ పెళ్లికి చేయూతనందించారు. గ్రామంలో ఆరేళ్లుగా ఏ పేదింట ఆడబిడ్డ పెళ్లి జరిగిన రూ.10,116 నగదు, పట్టుచీర అందిస్తూ వస్తున్నారు. గురువారం శ్రీను-మైబమ్మ దంపతుల కూతురు శ్రావణి వివాహం జరగ్గా.. నగదు, పట్టుచీర అందజేశారు.



బాధితుడికి పరామర్శ

యాచారం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిని మేడిపల్లికి చెందిన విఘ్నేశ్‌ను గురువారం బీఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయమందించారు. నగరంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విఘ్నేశ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.



క్రైం కార్నర్

టిప్పర్ ఢీకొని ఆరు మేకలు మృతి

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఆరు మేకలు మృతిచెందిన సంఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి మొగిలిగిద్ద శివారులోని పరిగి రోడ్డులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. మొగిలిగిద్ద గ్రామానికి చెందిన కామునిపల్లి నవీన్ తనకున్న మేకలను మేపేందుకు తీసుకెళ్తుండగా.. గంపల చెరువు శివారులోకి వెళ్లగానే షాద్‌నగర్ నుంచి కొందుర్గు వెళ్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఆరు మేకలు మృతిచెందాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

తలకొండపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చుక్కాపూర్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కథనం మేరకు.. కడ్తాల్ మండలం మర్రిపల్లికి చెందిన బాలమోని శివ స్కూటీపై బంధువుల శుభకార్యానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో టిప్పర్‌ను వెనక నుంచి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని వెల్దండ సమీపంలోని ఎన్నం ఆసుపత్రికి తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

ఆదిభట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవుటర్ రింగ్‌రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ సురక్షితం కాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికడదామని ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే కంపెనీ సేఫ్టీ ఇంజనీర్ ప్రేమ్‌కుమార్ వాహనదారులకు సూచించారు. గురువారం బొంగ్లూర్ ఎగ్జిట్ నంబర్ 12 వద్ద ఓఆర్ఆర్‌పై ప్రమాదాల గురించి వాహనదారులకు సిబ్బందితో కలిసి కరపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నెహ్రూ ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రమాదాలకు కారణం వాహనదారులు నియమాలు పాటించకపోవడమేనని, ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ఇతర వాహనదారులు ప్రమాదాల బారిని పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహరెడ్డి, గణేష్, మహిపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగం వెలకట్టలేనిది



రక్తదాన శిబిరంలో డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ జానకిరెడ్డి

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల త్యాగాలను ఎవరూ వెలకట్టలేరని మహేశ్వరం ఏసీపీ జానకిరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాలను పురస్కరించుకొని గురువారం పహడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కందుకూరు, మహేశ్వరం పోలీసు సిబ్బందితో పాటు వివిధ గ్రామాల యువతతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని అయన ప్రారంభించారు. కందుకూరు సీఐ సీతారాం మాట్లాడుతూ రక్తదానం మహత్తరమైన సేవ అని, ప్రాణాలను రక్షించే ఈ కార్యక్రమంలో భాగస్వాములైన వారిని అభినందించారు. డీసీపీ సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కందుకూరు పోలీసులు, నాయకులు నిమ్మ అంజిరెడ్డి, లిఖికుమార్, చరణ్‌కుమార్, ప్రశాంతచారి, రాజశేఖర్, కిరణ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేబినెట్‌లో మైనార్టీలకు చోటు హర్షణీయం

ఆమనగల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేబినెట్‌లో మైనార్టీలకు చోటు కల్పించడం హర్షదాయకమని కేఎస్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్‌బాబా అన్నారు. నేడు(శుక్రవారం) రాష్ట్ర మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మైనార్టీ నాయకుడు మహమ్మద్ అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేస్తుండడం శుభ సూచకమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తుందన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులవి కుట్ర రాజకీయాలు



ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజావిశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసం కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూదిని కొండల్ రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, మండ్లీ రాములు, గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో విపక్షాలు కనుమరుగు కాక తప్పదన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల గురువారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూసుఫ్‌గూడ వెంకటగిరి కాలనీలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, ఫరీద్, రమేశ్, కృష్ణానాయక్, చేగూరి వెంకటేశ్, హన్మ నాయక్, శ్రీశైలం, శ్రీకాంత్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యదర్శిగా మహేశ్‌కు అదనపు బాధ్యతలు



నియామక పత్రం ఇస్తున్న చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

కందుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సహకార సంఘం(పీఏసీఎస్) కార్యదర్శిగా అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసిన మహేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన నిమ్మ యాదగిరిరెడ్డి షాబాద్ మండల పీఏసీఎస్‌కు బదిలీపై వెళ్లడంతో గురువారం చైర్మన్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి ఆయన్ను సన్మానించి, మహేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాంచంద్రారెడ్డి, రాములు, హన్మంత్‌రెడ్డి, జంగయ్య, రైతులు ఉన్నారు.

గత పాలక వర్గానికి నోటీసులు

కందుకూరు సహకార సంఘంలో గతంలో జరిగిన అవకతవకలపై గత చైర్మన్ డి.చంద్రశేఖర్‌తో పాటు పాలకవర్గానికి జిల్లా కో-ఆపరేట్ అధికారి నోటీసులు జారీచేశారు. గతేడాది డిసెంబరులో రూ.82,500, ఈ సంవత్సరం మార్చిలో రూ.లక్షా 13వేలు, ఆ తరువాత రూ.3లక్షల నిధులు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలపై విచారణ చేపట్టనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. కాగా, వీటితో పాటు మరో కోటీ 69లక్షల 619 రూపాయలపై విచారణ చేపట్టనున్నట్లు ఈమేరకు కందుకూరు సహకార సంఘం కార్యాలయానికి నోటీసులు జారీ చేశారు.